# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 287 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | శుక్రవారం 07-08-2026


## పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయల మోసం ..



- నిందితురాలు రూపా రెడ్డి అరెస్ట్
- అధిక లాభాల ఆశ చూపించి పలువురి నుంచి డబ్బులు వసూలు –

7

## అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన యజమానులపై క్రిమినల్ కేసులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



7



# అస్సాంలో 95 ప్రాణాలు బలిగొన్న వరదలు

### 25 జిల్లాల్లో తీవ్ర ప్రభావం

- 1.22 లక్షల మంది వరదలతో అవస్థలు
- 365 గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే
- 15 వేల ఎకరాలకు పైగా పంటలు ధ్వంసం
- భారీ వర్షా ల హెచ్చరికతో మళ్లీ పెరిగిన ఆందోళన

అస్సాంలో భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలు రాష్ట్రాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, నదుల ఉధృత ప్రవాహంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరదల కారణంగా ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారికంగా వెల్లడించారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులుగా మారగా, లక్షలాది మంది జీవనం పూర్తిగా స్తంభించింది. వరద నీరు కొంతమేర తగ్గుముఖం పట్టినా అనేక ప్రాంతాలు ఇప్పటికీ నీట మునిగే ఉండటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

**డెస్క్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టగా, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలో నమోదైన 184 అనుమానిత కేసుల్లో 35 మందికి చండీపుర వైరస్ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా తెలిపారు. మరో 11 మంది నమూనాల పరీక్షా ఫలితాలు రావాల్సి ఉన్నాయని వెల్లడించారు. గాంధీనగర్, సబర్‌కాంత–హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆరుగురు చిన్నారులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు వివరించారు.

మిగతా 2 లో..

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

- తెలంగాణ ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన మహనీయుడి జయంతి వేడుకలు

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సిద్ధాంతకర్తగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.



## ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు



2

- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో పంపిణీ
- డెబిట్ కార్డు తరహాలో కొత్త రూపకల్పన
- బార్‌కోడ్‌తో ఆన్‌లైన్ వివరాల సౌకర్యం

## బొగ్గు శాఖ పనితీరుపై సమీక్ష

- కేంద్ర మంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం
- బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష
- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం
- ఇంధన భద్రతకు కార్యాచరణపై చర్చ

2





## కేటీఆర్‌తో ప్రకాష్ అంబేద్కర్ భేటీ

- హైదరాబాద్‌లో మర్యాదపూర్వక సమావేశం
- కేటీఆర్ నివాసంలో జరిగిన భేటీ

2

## సవరించిన బడ్జెట్‌కు సీఎం ప్రశంసలు

- ఆర్థిక మంత్రిని అభినందించిన సీఎం జోసెఫ్ విజయ్
- ప్రజా సంక్షేమమే బడ్జెట్ లక్ష్యమని వ్యాఖ్య
- రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యం

2



## సామాజిక న్యాయ పోరాటమే లక్ష్యం

- సంకల్ప సభలో కవిత కీలక ప్రకటనలు
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించాలన్న హెచ్చరిక
- లేదంటే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ చేపడతామని స్పష్టం





## జయశంకర్‌కు కేటీఆర్ నివాళి

- తెలంగాణ భవన్‌లో విగ్రహానికి పూలమాల వేసిన కేటీఆర్
- తెలంగాణ సిద్ధాంతకర్త సేవలను స్మరించిన బీఆర్ఎస్ నేతలు
- సమగ్ర అభివృద్ధికి దోహదమని అభిప్రాయం

**హైదరాబాద్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల లకు సిద్ధాంతపరమైన బలం చేకూర్చిన గొప్ప మేధావిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.

మిగతా 2 లో..

## గ్రామపంచాయతీ ఎదురుగానే ఉన్న ప్రభుత్వ పాఠశాల దుస్థితి...

గ్రామపంచాయతీ ఎదురుగానే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి... అధికారులు చూస్తున్నారా..?




5

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు



**డెస్క్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాయి. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన మేధోబలం, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమానత్వం కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. 1934 ఆగస్టు 6న హనుమకొండ జిల్లా అక్కంపేటలో జన్మించిన జయశంకర్, ఆర్థిక శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా విశిష్ట సేవలు అందించారు. తెలంగాణ ప్రాంతం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అసమానతలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రజా సమావేశాలు, సదస్సులు, రచనలు, ఉపన్యాసాల ద్వారా తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన ఆయన విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనాభివృద్ధి, విద్యార్థి సంక్షేమానికి విశేష కృషి చేశారు. సరళ జీవనం, నిబద్ధత, నిజాయితీతో కూడిన ఆయన వ్యక్తిత్వం అనేక మంది యువతకు ఆదర్శంగా నిలిచింది. 2011లో ఆయన మరణించినప్పటికీ, 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఆయన కలల్లో ఒకటి సాకారమైంది. తెలంగాణ చరిత్రలో ఆయన సేవలకు చిరస్థాయి స్థానం ఉందని పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. జయంతి సందర్భంగా పలు విద్యాసంస్థల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, స్మారక సభలు నిర్వహించి ఆయన ఆశయాలను యువతకు పరిచయం చేశారు. సమానత్వం, ప్రజా సంక్షేమం, నాణ్యమైన విద్య, గ్రామీణాభివృద్ధిపై ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు.

## బొగ్గు శాఖ పనితీరుపై సమీక్ష

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, కార్మికుల సంక్షేమం, దేశ ఇంధన అవసరాల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, వివిధ ప్రాంతాలకు సరఫరా ప్రక్రియను మంత్రి సమీక్షించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. బొగ్గు రంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రజాకేంద్రిత కార్యక్రమాల పురోగతిని కూడా సమావేశంలో పరిశీలించారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బొగ్గు గనుల నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై కూడా చర్చించారు. బొగ్గు రంగంలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా బొగ్గు ఉత్పత్తి, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బొగ్గు రంగ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

## కేటీఆర్‌తో ప్రకాష్ అంబేద్కర్ భేటీ



**హైదరాబాద్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

వంచిత్ బహుజన్ అగాడీ (వీబీఏ) అధినేత, భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ గురువారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సమావేశంలో ఇరు నాయకులు పరస్పరం పలకరించుకుని వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ మర్యాదపూర్వక సమావేశంగా జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశానికి బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా హాజరయ్యారు. భేటీ అనంతరం కేటీఆర్, ప్రకాష్ అంబేద్కర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఇరువురు నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కొంతసేపు ముచ్చటించారు. ప్రకాశ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలపై ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు ప్రకాష్ అంబేద్కర్‌కు స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. భేటీ అనంతరం నాయకులు పరస్పరం జ్ఞాపికలు ఇచ్చిపుచ్చుకుని ఫొటోలు దిగారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను బీఆర్‌ఎస్ పార్టీ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. ప్రకాష్ అంబేద్కర్‌తో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అస్సాంలో 95 ప్రాణాలు బలిగొన్న వరదలు

**గువాహటి, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



చండీపుర వైరస్ నిర్ధారణ అయిన వారంతా 15 ఏళ్లలోపు రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాలు వరదల ప్రభావానికి గురయ్యాయి. బ్రహ్మపుత్ర నది, దాని ఉపనదులు ఉప్పొంగడంతో వందలాది గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రస్తుతం కూడా 365కు పైగా గ్రామాలు నీటిలోనే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు తెగిపోవడం, వంతెనలు దెబ్బతినడం వల్ల అనేక ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా, తాగునీటి పంపిణీ కూడా అనేక గ్రామాల్లో అంతరాయం కలిగింది. అధికారులు పడవల ద్వారా ఆహారం, తాగునీరు, మందులు సరఫరా చేస్తున్నారు.

వరదల ప్రభావంతో సుమారు 1.22 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది కుటుంబాలు సహాయ శిబిరాలకు తరలించబడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక వైద్య బృందాలు సేవలు అందిస్తున్నాయి. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అప్రమత్తమైంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలను కూడా వేగవంతం చేశారు. వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. సుమారు 15 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు పూర్తిగా నీటమునిగిపోయాయి. వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలు నాశనమవడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. పశుసంపదకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. పశువులకు మేత, పశువైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి పలు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించిన వారు బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు. వరదల వల్ల దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, ప్రభుత్వ మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా భారత వాతావరణ శాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. పొరుగు రాష్ట్రాలైన మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వర్షాల ప్రభావంతో బ్రహ్మపుత్ర సహా ప్రధాన నదుల్లో మళ్లీ నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అస్సాంలో మరోసారి వరద ముప్పు పొంచి ఉందనే ఆందోళన నెలకొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలేందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. విపత్తు నిర్వహణ దళాలు, జాతీయ విపత్తు స్పందన బృందాలు, సైన్యం, స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను కొనసాగిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి.

## సవరించిన బడ్జెట్‌కు సీఎం ప్రశంసలు

**చెన్నై, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, అభివృద్ధి శాఖ మంత్రి ఎన్. మారి విల్సన్‌ను అభినందించారు. బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను సమర్పించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సవరించిన బడ్జెట్ విద్యార్థులు, యువత, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, కార్మికులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు తదితర అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడేలా రూపొందించబడిందని అన్నారు. ఈ బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గంలో కొత్త ఆశలను నింపుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ బడ్జెట్ రాష్ట్ర వ్యవసాయాభివృద్ధితో పాటు పశుసంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, ఆహార శుద్ధి, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రైతుల ఆదాయం పెంచడంతో పాటు వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేసే విధంగా పథకాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం జోసెఫ్ విజయ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమాన్ని సమానంగా దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రగతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ఈ బడ్జెట్ మరింత బలం చేకూరుస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని తెలిపారు. సుభిక్షమైన తమిళనాడు నిర్మాణ దిశగా ప్రభుత్వం చేపట్టిన విజయయాత్ర నిరంతరం కొనసాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటిస్తూ ఆర్థిక మంత్రికి మరోసారి అభినందనలు తెలిపారు.

## ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

**హైదరాబాద్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణలో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ షెడ్యూల్‌కు ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదం తెలిపారని చెప్పారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. అర్హుల తుది జాబితాలను సిద్ధం చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో ఉండనున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డులతో పోలిస్తే ఇవి మరింత సౌకర్యవంతంగా ఉండటంతో పాటు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా రూపొందించారు. కొత్త కార్డులపై కుటుంబ సభ్యుల పేర్లు, ఫొటోలు ముద్రించకుండా ప్రత్యేక గుర్తింపు సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉండనుంది. బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. దీంతో సేవల నిర్వహణ మరింత పారదర్శకంగా, సులభంగా మారనుంది. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

## సామాజిక న్యాయ పోరాటమే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ కు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో టీఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంకల్ప సభ దేశంలోని కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చే ఉద్యమానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. కవిత మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు ఆమోదించి ముందుకు తీసుకురావాలని కోరారు. అలా జరగకపోతే వెయ్యి కార్లతో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సామాజిక న్యాయం కోసం రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను బీసీల హక్కుల గురించి మాట్లాడితే తనపై విమర్శలు చేస్తున్నారని, అయితే తన పుట్టుక తన చేతిలో లేకపోయినా ఎవరి కోసం పని చేయాలనే నిర్ణయం మాత్రం తనదేనని కవిత వ్యాఖ్యానించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేస్తున్నానని చెప్పారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు మరో దశ ఉద్యమం అవసరమని, తెలంగాణ సాధించినట్లే సామాజిక తెలంగాణను కూడా సాధించాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ముస్లింలు, మహిళలు, ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆదివాసీలకు అడవులపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలు తీర్మానాలను సభ ఆమోదించింది. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ఇవ్వడం, ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ప్రకటించాలని కేంద్రాన్ని కోరడం, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం, ఎస్సీ, ఎస్టీ నిధులను ఆయా వర్గాల అభ్యున్నతికే వినియోగించడం వంటి తీర్మానాలను ప్రకటించారు. సామాజిక న్యాయ ఉద్యమాన్ని సావిత్రిబాయి పూలే జయంతి వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన సామాజిక తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు అందరూ ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# జయశంకర్‌కు కేటీఆర్ నివాళి

**మొదటిపేజీ తరువాయి**

ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూధనాచారి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. అలాగే ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గండ్ర వెంకటరమణ, బానోత్ శంకర్ నాయక్, కోరుకంటి చందర్, మెతుకు ఆనంద్, బిగాల గణేష్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య



యాదవ్, మాజీ జడ్పీ ఛైర్మన్ తుల ఉమా తదితరులు పాల్గొన్నారు. నేతలు జయశంకర్ ఆశయాలు, తెలంగాణ ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో నడుస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి, స్వాభిమానం కోసం ఆయన సిద్ధాంతాలు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఫైనల్‌లో స్వర్ణమే లక్ష్యం..

- ఫైనల్‌లో స్వర్ణమే లక్ష్యం.. బిక్కనూరు ప్రజల ఆశలు రిశ్వితపైనే
- ప్రపంచ క్యాడెట్ క్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.. నేడు తుది పోటీ..



**బిక్కనూరు, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**

ఇటలీలోని ట్రెంటో ప్రావిన్స్‌లోని టోర్బోలే సుల్ గార్డా ప్రాంతంలో గార్డా సరస్సుపై జరుగుతున్న 2026 ప్రపంచ క్యాడెట్ క్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో బిక్కనూరుకు చెందిన చిన్నారి రిశ్విత ప్రతిభ చాటుతోంది. జూలై 31 నుంచి ఆగస్టు 7 వరకు జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో ప్రపంచ దేశాల యువ సెయిలర్లతో పోటీపడుతూ రిశ్విత అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. గురువారం జరిగిన రేసులో రిశ్విత కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని బిక్కనూరు గ్రామంతో పాటు తెలంగాణకు గర్వకారణంగా నిలిచింది. శుక్రవారం జరిగే తుది పోటీలో స్వర్ణ పతకం సాధించాలని గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తూ బిక్కనూరు పేరును ప్రపంచానికి పరిచయం చేస్తున్న రిశ్విత ఫైనల్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకంతో తిరిగి రావాలని గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యవసాయరైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- తుమ్మలతో షబ్బీర్ అలీ కీలక భేటీ
- కామారెడ్డి వ్యవసాయం, పామాయిల్ సాగు, రైతు అంశాలపై చర్చ...



**హైదరాబాద్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి నియోజకవర్గ రైతుల సమస్యలు, పంటల పరిస్థితి, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అలీ గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి చర్చించారు. ఇటీవల వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పంటల ప్రస్తుత పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పామాయిల్ సాగు విస్తరణ వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలోనూ రైతులకు అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. పామాయిల్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటోందని మంత్రి తుమ్మల ఇప్పటికే పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అలాగే రైతులకు అవసరమైన మద్దతు, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, జిల్లాలో అమలు చేయాల్సిన పలు అభివృద్ధి అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కామారెడ్డి జిల్లాకు సంబంధించిన పలు ప్రతిపాదనలను షబ్బీర్ అలీ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గూడెం శ్రీను, భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై షబ్బీర్ అలీతో వరుస భేటీలు

- రామేశ్వర్‌పల్లి సమస్యలు.. బస్వాపూర్ సహకార సంఘం విభజనపై వినతులు..

**హైదరాబాద్, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజా సమస్యలు, బస్వాపూర్ సహకార సంఘం విభజన అంశంపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీని బుధవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. మొదట భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ అలీని కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం బస్వాపూర్ సహకార సంఘం విభజన అంశంపై బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యట్లపల్లి సర్పంచ్ నీలంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు తుడుం ప్రదీప్ తదితరులు షబ్బీర్ అలీతో సమావేశమయ్యారు. సహకార సంఘం విభజన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు



సంబంధించిన ఇతర ప్రజా సమస్యలను కూడా నాయకులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై కూడా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామేశ్వర్‌పల్లి గ్రామ ప్రతినిధుల బృందంలో రాజేందర్, శశికుమార్, కొండల్ రెడ్డి, రాకేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రమేష్ రెడ్డి, సూర్యకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బస్వాపూర్ సహకార సంఘం ప్రతినిధుల బృందంలో బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యట్లపల్లి సర్పంచ్ నీలంరెడ్డి, బాగారెడ్డి, తుడుం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం..!

- భిక్కనూరులో తల్లిపాల వారోత్సవాలు.. ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు తల్లిపాలే పునాది..



**భిక్కనూరు, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలో గురువారం తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బల్యాల రేఖా సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ బల్యాల రేఖా సుదర్శన్ మాట్లాడుతూ, నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, ప్రతి తల్లి ఈ విషయంలో అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ మంగ తల్లిపాల ప్రాముఖ్యత, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుల పోషణపై వివరించారు. ఏఎన్‌ఎం కూడా తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి, అపోహలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వ్యసన రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

**బిక్కనూరులో విద్యార్థులతో 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ...**

**బిక్కనూరు, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**

వ్యసన రహిత భారత నిర్మాణమే ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రధాన లక్ష్యమని బ్రహ్మకుమారి జయాదీది, గంగాలత తెలిపారు. గురువారం బిక్కనూరులోని శ్రీ చైతన్య విద్యానికేతన్, గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వారు పాల్గొని విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ప్రశాంతమైన జీవితాన్ని గడపడమే కాకుండా తమ లక్ష్యాలను సులభంగా చేరుకోగలరని, కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడతారని పేర్కొన్నారు. దేశ భద్రత, దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి "నషా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీ చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ రేణుకుమార్, హెడ్‌మాస్టర్



అశోక్ యాదవ్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు శెనిశెట్టి రాజలింగం, గుంటుకు రాజు, కోడిప్యాక ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

**మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు..**



**కామారెడ్డి, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కౌన్సిలర్లు అంజాద్, జావీద్, మజీద్, లడ్డు, హఫీజ్, లోలం శ్రీనివాస్, మన్సూర్, కో–ఆప్షన్ సభ్యుడు ముబాషీర్, కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత్ రావు, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీకి బోనాల ఉత్సవాల ఆహ్వానం

**శ్రీరామ్ నగర్ కాలనీ వేడుకలకు హాజరు కావాలని కోరిన టీం ఆల్ఫా సభ్యులు..**



**హైదరాబాద్, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని టీం ఆల్ఫా సభ్యులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆగస్టు 9న కామారెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్వహించనున్న బోనాల పండుగతో పాటు తొట్టెల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన షబ్బీర్ అలీ, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీం ఆల్ఫా సభ్యులు నిరంజన్ రెడ్డి, నవీన్ కుమార్, తేజ, జక్రియ, మునీబ్, అబ్దుల్లా, సయ్యద్, అజ్మాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువరైతు మృతి...

**తూప్రాన్, ఆగస్టు 6. ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ):**



తూప్రాన్ మండలం లో వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన విషాద ఘటన తూప్రాన్ మండల పరిధిలో చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన జింక నాగార్జున (26) పొలం వద్ద నేలపై పడివున్న విద్యుత్ వైర్లకు కరెంటు లేదని భావించి దానిని పక్కకు తొలగించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వైరులో విద్యుత్ ప్రవహిస్తుండటంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తూప్రాన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కాట్రేనికోన, ఆగస్టు 6:(నవ జ్యోతి ప్రతినిధి):**



కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం సావరం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు వేగంగా ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో మరో వ్యక్తికి గాయాలైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## శభాష్ పల్లి లో ఒకే రైతుకు చెందిన మూడు పాడి గేదెల మృత్యువాత





**శివంపేట ఆగస్టు 6 నవజ్యోతి ప్రతినిధి (ఆకుల శ్రీనివాస్) :**

శివంపేట మండలం శభాష్ పల్లి గ్రామంలో పాడి గేదెలు, అనుమానాస్పదంలో అవస్థతకు గురికావడంతో చికిత్స కోసం స్థానిక వైద్యశాలలకు వెళ్లగా అక్కడ సిబ్బంది అందుబాటులో లేక మృత్యువాత పడినట్లు అదేవిధంగా వైద్య అధికారికి పలుమార్లు ఫోన్ చేయగా స్పందించకపోవడం వలన సకాలంలో వైద్యం అందక మూడు పాడి గేదెలు మృత్యువాత పడినట్లు రైతు జోడు ప్రశాంత్, తండ్రీ జోడు ముత్యాలు, పాడి గేదెలను నమ్ముకుని ప్రతిరోజు వాటిని నమ్ముకుంటూ జీవనోపాధి చేసుకుంటున్నమని సుమారు ఒక్కో గేదె 150000 వరకు ఉండగా మొత్తం 450000 ఉంటుందని బోరున ఏడుస్తూ వివరించారు. అదేవిధంగా పశు వైద్య సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా ఉండడం వల్లే మూగజీవాలకు వైద్యం అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బంది సమన్వయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతులు కోరుతున్నారు.

## వ్యసన రహిత భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:

### ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు...



**ముమ్మిడివరం (నవ జ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు):**

ప్రభుత్వం చేపట్టిన "వ్యసన రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో, ప్రజాప్రతినిధులతో, విద్యార్థులతో కలిసి వ్యసన రహిత భారత్ ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. ప్రతిజ్ఞలో భాగంగా ఏ పరిస్థితిలోనూ మత్తు పదార్థాలను ఉపయోగించబోమని, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజాన్ని వ్యసనాల బారిన పడకుండా చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తామని, వ్యసనాలకు సంబంధించిన ప్రభుత్వ చట్టాలను తప్పనిసరిగా పాటిస్తామని, పరిసరాలను పరిశుభ్రంగా మరియు వ్యసన రహితంగా ఉంచేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన తెలంగాణ మేధావి, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంతబలం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాసేవను మరింత బాధ్యతతో కొనసాగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. జయశంకర్ ఆశయాలను భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, ఏఎంసీ లక్ష్మయ్య, వార్డ్ ఆఫీసర్లు, సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## మాదిగ బోనాల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగా మాదిగ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8న (శనివారం) నిర్వహించనున్న మాదిగ బోనాల మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వేడుకలకు శ్రీ అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని, ఆయన కార్యక్రమానికి హాజరుకానున్నట్లు వెల్లడించారు. శనివారం ఉదయం ఐబీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే బోనాల ఊరేగింపు హస్తబల్ ఎల్లమ్మ దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగుతుందని తెలిపారు. మాదిగ సమాజ ఐక్యతకు ప్రతీకగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు, పోలీసులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఆగస్టు 10 జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సీఐటీయూ

**తూప్రాన్, ఆగస్టు 6.( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**



కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తూప్రాన్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని, పంటలకు గిట్టుబాటు ధర, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా కేంద్ర ప్రభుత్వం దానిని బలహీనపరిచే నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, పేదల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే చర్యలను నిలిపివేయాలని కోరారు.

అలాగే కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం కార్మిక హక్కులకు విఘాతమని పేర్కొన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఎం. నర్సింలు, రవీంద్ర ప్రసాద్, స్వామి, జీవన్, అశోక్, రజనీకాంత్, రాజిరెడ్డి, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలే తెలంగాణకు దిక్సూచి

### వారాల వినోద్ కుమార్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చేర్చడమే ఆయనకు నిజమైన నివాళి అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ అన్నారు. సూరారంలో తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తన జీవిత లక్ష్యంగా మలుచుకుని, రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు అంకితభావంతో పోరాడిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ జీవితం, సిద్ధాంతాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి, భూపాలపల్లి జిల్లాకు జయశంకర్ పేరు పెట్టడం, ప్రతి ఏడాది ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని తీసుకురావడం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, గట్టు అశోక్, లక్ష్మణ్ రాజు, యాదవ్ బాలస్వామి, రమేష్ యాదవ్, జగన్ తదితరులు పాల్గొని జయశంకర్ కు ఘన నివాళులర్పించారు.

## బాచుపల్లిలో భారీ కమర్షియల్ షెడ్...చట్టానికే సవాల్?

- ఫ్లైఓవర్ పక్కనే భారీ కమర్షియల్ షెడ్...ఎవరి అండతో నిర్మాణం?
- సెట్ బ్యాక్ లకు సెట్ అప్?...షెడ్ నిర్మాణంపై పెరుగుతున్న అనుమానాలు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ సమీపంలో, హీరో హేత్విక్ ఆటోమొబైల్స్ పక్కన భారీ కమర్షియల్ షెడ్ నిర్మాణం జోరుగా సాగుతోంది. ప్రధాన రహదారి ప్రక్కన నిర్మాణం జరుగుతున్నప్పటికీ, నిబంధనల ప్రకారం ఉండాల్సిన సెట్‌బ్యాక్‌లు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద స్థాయిలో నిర్మాణం జరుగుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడం, చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నిర్మాణానికి అధికారుల మౌన సహకారమా? లేక స్థానిక రాజకీయ అండదండలతోనే పనులు కొనసాగుతున్నాయా? అనే చర్చ స్థానికంగా జరుగుతోంది. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని చట్టాన్ని అమలు చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? లేక ఉద్దేశపూర్వకంగానే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారి ప్రక్కన భారీ కమర్షియల్ నిర్మాణం భవిష్యత్తులో ట్రాఫిక్, భద్రత సమస్యలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, ఇతర నిబంధనలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## రౌడీషీటర్ పై పీడీ యాక్ట్ అమలు

- ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు: ఎస్పీ రాజేష్ చంద్ర...

**కామారెడ్డి, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**



జిల్లాలో వరుసగా నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న రౌడీషీటర్ కాట్యాడ బాపురావు అలియాస్ బాపురావుపై తెలంగాణ ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం (పీడీ యాక్ట్) కింద ఏడాది పాటు నిర్బంధ ఉత్తర్వులు అమలు చేసినట్లు జిల్లా పోలీసులు గురువారం వెల్లడించారు. సదాశివనగర్ మండలం వజ్జేపల్లి గ్రామానికి చెందిన బాపురావు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల జర్నలిస్టునని చెప్పుకుంటూ ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసుతో పాటు గాంధారి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఎక్స్‌టార్షన్, క్రిమినల్ బెదిరింపుల కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వుల మేరకు పీడీ యాక్ట్ అమలు చేయగా, ప్రస్తుతం న్యాయపరమైన నిర్బంధంలో ఉన్న అతడికి నిజామాబాద్ సెంట్రల్ జైలులో డిటెన్షన్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే దోపిడీలు, బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై అవసరమైతే పీడీ యాక్ట్‌తో సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్....

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**సంగారెడ్డి, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి )**



తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి, తన జీవితాన్ని తెలంగాణ ప్రజల హక్కుల కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక, సామాజిక, ఆర్థిక ఆధారాలతో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా మేధావి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సైద్ధాంతిక దిశానిర్దేశం చేసిన ఆయన రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు ఉద్యమానికి అపారమైన మేధోబలాన్ని అందించాయని పేర్కొన్నారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, సమానత్వం, ప్రాంతీయ న్యాయం, సామాజిక చైతన్యంపై చేసిన అధ్యయనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు . అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- **కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ పిలుపు**

**కీసర, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల ఆగస్టు 10న నిర్వహించే "జైలు భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధానాలు అవలంబిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛలను కాలరాస్తోందని విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్న జైలు భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు జైలు భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బండ్లగూడ, దుబాయ్ బిల్డింగ్, దమ్మాయిగూడ, ఆర్‌జీకే కాలనీ, అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రాంతాలకు చెందిన మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్‌పల్లి బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**మెట్ పల్లి, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి) :**

మెట్‌పల్లి పట్టణంలోని బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డీఈతో మాట్లాడిన ఎమ్మెల్యే డ్రైనేజీ నిర్మాణంలో జరుగుతున్న లోపాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.. ప్రస్తుతం ఉన్న ప్రధాన డ్రైనేజీ వెడల్పు సుమారు 7½ ఫీట్లు ఉండగా, దానికి బదులుగా కేవలం 3 ఫీట్లు పైపులు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించడం వల్ల భవిష్యత్తులో డ్రైనేజీ నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.. భారీ వర్షాల సమయంలో నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను ప్రశ్నించారు.. మొన్న మెట్‌పల్లి పెద్ద చెరువు విషయంలో కూడా ఇలాంటి నిర్లక్ష్య నిర్ణయాల వల్ల చెరువు తీవ్రంగా దెబ్బతిందని గుర్తు చేసిన ఎమ్మెల్యే ఇప్పుడు అదే విధానాన్ని డ్రైనేజీ నిర్మాణంలో అనుసరించడం బాధాకరమని, ఇది ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.. డ్రైనేజీ సామర్థ్యాన్ని తగ్గించే విధంగా కాకుండా, ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వెడల్పుకు అనుగుణంగా పూర్తి స్థాయి పైపులు ఏర్పాటు చేసి, అవసరమైతే నిర్మాణ ప్రణాళికను వెంటనే సవరించాలని



అధికారులను ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.. నాణ్యతతో కూడిన శాశ్వత నిర్మాణం చేపట్టాలని, భవిష్యత్తులో నీటి నిల్వ, వరదలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సాంకేతిక ప్రమాణాలను పాటించాలని సూచించారు..

# గ్రామపంచాయతీ ఎదురుగానే ఉన్న ప్రభుత్వ పాఠశాల దుస్థితి...

- **అధికారుల కళ్లు తెరవాల్సిన సమయం..!**
- **గ్రామపంచాయతీ ఎదురుగానే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి... అధికారులు చూస్తున్నారా..?**

**ఉమ్మడి రంగారెడ్డి, ఆగస్టు 06, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**




రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం అలంఖాన్ గూడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి చూస్తే ప్రతి ఒక్కరి మనసును కలిచివేస్తోంది. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఈ పాఠశాల ఎక్కడో మారుమూల ప్రాంతంలో లేదు. గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎదురుగానే ఉంది. ప్రతిరోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయినా పాఠశాల ప్రాంగణంలో ఉన్న రాళ్లు, రప్పలు, అసౌకర్యాలు ఎవరికీ కనిపించడం లేదా అనే ప్రశ్న స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ రాళ్ల మధ్య చిన్నారులు ఎలా ఆడుకుంటారు? ఎలా పరిగెడతారు? ఒకవేళ పిల్లలు జారి పడితే లేదా ప్రమాదానికి గురైతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? అధికారులు సమాధానం చెబుతారా? గ్రామాల అభివృద్ధి గురించి సమావేశాలు నిర్వహించడం, నివేదికలు పంపించడం మాత్రమే అభివృద్ధి కాదు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించడం అధికారుల అసలు బాధ్యత. గ్రామపంచాయతీకి వచ్చిన ప్రతిసారి ఎదురుగానే ఉన్న ఈ పాఠశాలను ఒక్కసారి పరిశీలించి ఉంటే ఈ దుస్థితి ఇంతకాలం కొనసాగేదా? పాఠశాలలో పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా ఉంది? తాగునీటి సౌకర్యం ఉందా? మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా? ప్రాంగణం సురక్షితంగా ఉందా? వంటి అంశాలను సంబంధిత మండల అధికారులు, విద్యాశాఖ అధికారులు ఎప్పుడైనా సమగ్రంగా పరిశీలించారా? పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతున్నారనే కారణంతో వారి భద్రతను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అందే సౌకర్యాల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి చిన్నారికి కూడా సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా కలెక్టర్ కి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు మా విజ్ఞప్తి ఒక్కటే. అలంఖాన్ గూడ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితిని వెంటనే పరిశీలించి, ప్రాంగణంలోని రాళ్లు, రప్పలను తొలగించి, అవసరమైన అన్ని మౌలిక వసతులను అత్యవసరంగా కల్పించాలి. పిల్లల భద్రత విషయంలో ఇకపై నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలి. చిన్నారుల భద్రత రాజకీయాలకు అతీతం. వారి ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో ఘనంగా జయశంకర్ జయంతి గద్దర్ వర్ధంతి

**మిర్యాలగూడ, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్, తన గళం ద్వారా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రజాకవి గద్దర్, గ్రంథాలయ ఉద్యమ నాయకులు కస్తూరి ప్రభాకర్, సామాజికవేత్త డాక్టర్ రాజు పేర్కొన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణకు దశా–దిశను చూపిన గొప్ప మేధావి జయశంకర్ అని కొనియాడారు. ప్రజా గీతాల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించి తెలంగాణ ఉద్యమానికి విశేష సేవలందించిన గొప్ప ప్రజాకవి గద్దర్ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సుధాకర్, జన విజ్ఞాన వేదిక



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కళాశాల ప్రిన్సిపల్ కోలా శ్రీనివాస్, అధ్యాపకులు సంతోష్ కుమార్, రాజు, శ్రవణ్, లక్ష్మయ్య, కృష్ణయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష

- **మండల స్థాయి సమన్వయ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష**

**మాడుగులపల్లి, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి)**




మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పి.సాహితి అధ్యక్షతన మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి జి.వంశీధర్, మండల తహసీల్దార్ సరోజ పావని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాశం సంపత్ రెడ్డి, మండల స్థాయి శాఖల అధికారులు, గ్రామపంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు. సమావేశంలో మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించి, శాఖల వారీగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.

# సాయి ప్రియా నగర్ పార్కుల కబ్జాలు తొలగించాలి



- **డిప్యూటీ కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి – పార్కుల సుందరీకరణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి**

**మేడిపల్లి, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సాయి ప్రియా నగర్ పార్కులపై జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించి, పార్కులను అభివృద్ధి చేయాలని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, పార్కులు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని అన్నారు. ఆక్రమణలను తొలగించి మున్సిపల్ నిధులతో పార్కులను సుందరీకరించి చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఆహ్లాదకరంగా వినియోగించుకునేలా అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్కుల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని, ఆక్రమణలను పూర్తిగా తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, నాగరాజు, సాయిరాం గౌడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాలకు ముస్తాబవుతున్న కుషాయిగూడ పోచమ్మ ఆలయం



- **ఆగస్టు 9న ఆషాఢ బోనాల మహోత్సవాలు – భక్తులకు ఆలయ కమిటీ ఆహ్వానం**
- **"ఇంటింటా బోనం... ఊరంతా సంబరం...**

**కుషాయిగూడ, ఆగస్టు 06, (నవజ్యోతి ప్రతినిధి) :**

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈ నెల 9న ఆదివారం నిర్వహించనున్న శ్రీ కుషాయిగూడ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాల కోసం ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా అలంకరించబడుతోంది. భక్తుల రాకకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కుషాయిగూడతో పాటు పరిసర కాలనీల ప్రజలందరూ అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులు తీర్చుకుని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. అలాగే బోనాల మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి కరుణా కటాక్షాలతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# నాగారంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

- **ప్రభుత్వ భూమి కేటాయించాలని కీసర తహసీల్దార్ కు వినతి – సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్**

**నాగారం, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి):**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, నాగారం డివిజన్‌లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి సర్వే నెం. 291/3లో ఉన్న 2 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ కీసర తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అక్కల సురేష్ కుమార్ మాట్లాడుతూ... మాట్లాడుతూ, సర్వే నెం. 291/3లోని భూమి ఇప్పటికే ప్రభుత్వ భూమిగా నిర్ధారించబడినందున అదే స్థలంలో ఆధునిక సౌకర్యాలతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. అలాగే ఈ ప్రతిపాదనను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో), జిల్లా కలెక్టర్‌కు పంపించి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆసుపత్రి నిర్మాణం ద్వారా నాగారం, దమ్మాయిగూడ, కీసర, రాంపల్లి, కుందన్‌పల్లి, చీర్యాల, చర్లపల్లి, అంకిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు చేరువవుతాయని తెలిపారు.ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఈ ప్రాంతంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు వల్ల లక్షలాది మంది ప్రజలు ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## జయశంకర్ ఆశయాల సాధనకు యువత పని చెయ్యాలి : సర్పంచ్ దున్నా శ్రీనివాస్.



**నడిగూడెం,ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్) :**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నందు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏ లక్ష్యంతో తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను అమలు చేసుకునే బాధ్యత కూడా నేటి యువతపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఏఎన్ఎంలు రాధా, సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, జూనియర్ అసిస్టెంట్ వంశీ, గ్రామస్తులు జలీల్ అహ్మద్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో మహిళ అదృశ్యం

### ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**కుషాయిగూడ, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం, లక్ష్మీనరసింహ కాలనీ సమీపంలోని డిమార్ట్ వద్ద నివాసముంటున్న గౌరీ రాథోడ్ ఫిర్యాదు మేరకు, ఆమె చెల్లెలు గంగి బాయ్ (38) గత నెల రోజులుగా ఆమె వద్ద ఉంటూ కూలీ పని చేస్తోంది. ఆగస్టు 4న ఫిర్యాదుదారురాలు బోనాల పండుగ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లగా, గంగి బాయ్ ఇంట్లోనే ఉన్నట్లు తెలిపారు.ఆగస్టు 5న సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఫోన్ చేయగా, "బయట ఉన్నాను.. ఇంటికి వస్తున్నాను" అని చెప్పిందని తెలిపారు. అనంతరం మళ్లీ ఫోన్ చేయగా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. అనంతరం ఆమె అల్లుడు ఫోన్ చేయగా, కుషాయిగూడలోని కల్లు కాంపౌండ్ వద్ద ఉన్నానని చెప్పి కాల్‌ను ముగించినట్లు తెలిపారు. ఆ తర్వాత నుంచి ఆమె ఆచూకీ లభించలేదని, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ లేదా అవుట్ ఆఫ్ కవరేజ్‌లో ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.అదృశ్యమైన గంగి బాయ్ ఎత్తు సుమారు 5 అడుగుల 2 అంగుళాలు, చామనచాయ రంగుతో ఉండి, తెలుగు, లంబాడి భాషలు మాట్లాడగలదని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి, మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## టీడబ్ల్యూజెఎఫ్ సహాయ కార్యదర్శిగా బక్కోల్ల రాము నియామకం

### పటాన్ చెరు నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**పటాన్ చెరు,ఆగస్టు06(నవజ్యోతి ప్రతినిధి):**




తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ గురువారం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా పటాన్‌చెరు ఐబీ అతిథి గృహంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో నేటి దినపత్రిక సూర్య పటాన్ చెరు,రిపోర్టర్ బక్కోల్ల రాముకు సహాయ కార్యదర్శిగా అవకాశం దక్కింది.

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ..తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీలో నన్ను సహాయ కార్యదర్శిగా ఎన్నుకుని నాపై నమ్మకం ఉంచినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు.ఈ అవకాశం కల్పించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్,జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్, రాష్ట్ర నాయకులు మేకల కృష్ణయ్య, ప్రభ జాతీయ కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి , అలాగే నూతనంగా ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షులు బాదిని శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సత్యంతో పాటు నా తోటి సహాయ కార్యదర్శులు గిరి,ప్రసాద్, కృష్ణాగౌడ్ ఉన్నారు. నాపై విశ్వాసం ఉంచిన సహచర జర్నలిస్టు మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ.. మీ అందరి ఆశయాలకు అనుగుణంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సంఘ బలోపేతం కోసం నిబద్ధతతో పనిచేస్తానని రాము తెలియజేశారు.

## ముదిరాజ్ ఐక్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యం : సిల్వర్ చంద్రశేఖర్

### ఆగస్టు 9 బోనాల మహోత్సవాలకు ఘన ఏర్పాట్లు

**సంగారెడ్డి, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

ముదిరాజ్ సమాజం ఐక్యంగా ఉంటే రాజకీయ, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత పురోగతి సాధించగలదని ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు సిల్వర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 9న నిర్వహించనున్న బోనాల మహోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లుగా సంగారెడ్డిలో ముదిరాజ్ సమాజం ఐక్యంగా బోనాల వేడుకలు నిర్వహించడం సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, యువకులు పోతరాజుల వేషధారణలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, డప్పు వాయిద్యాలు, అన్నదాన కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు తెలుగు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్, పిట్టల రమేష్, పి. రాములు, ఎం. తిరుమలరావు, తలారి రామచందర్, పి. సుగుణాకర్, బి. మురళీధర్, ఈ. ఆంజనేయులు, గట్టుమీది రామకృష్ణ, సి. బుస్త సాయికిరణ్, గవ్వల కేశవులు, నరసింహులు, గంజిగూడెం శ్రీనివాస్, సారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాగారం బోనాల మహోత్సవాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

- **పలాహారం బండి ఊరేగింపులో పాల్గొనాలని కాంగ్రెస్ నాయకుల ఆహ్వానం**

**నాగారం, ఆగస్టు 06,(నవజ్యోతి ప్రతినిధి):**



ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్‌లో ఆగస్టు 9న నిర్వహించనున్న శ్రీ మహంకాళి బోనాల మహోత్సవాలు మరియు పాలాహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనరసింహ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా & శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందాడి అంజి రెడ్డిలను నాగారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నాగారం శ్రీ మహంకాళి బోనాల మహోత్సవాలు ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతాయని, ఈసారి నిర్వహించే పాలాహారం బండి ఊరేగింపును మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, సీనియర్ నాయకులు చిన్నంరాజు, సతీష్ గౌడ్, గణపురం కొండల్ రెడ్డి,తాలీం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

### సర్పంచ్ దున్న శ్రీనివాస్

**నడిగూడెం, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్) :**

ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలను మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు గురువారం కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసిన రాత పుస్తకాలను పంపిణీ చేశారు అనంతరం మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థిగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కళాశాలలో సౌకర్యాల కల్పనకు తమ పాలకవర్గం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుం దన్నారు కళాశాలకు ప్రహరీ గోడ సిసి రోడ్డు విద్యార్థులకు వసతిగృహం సౌకర్యం కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి కృషి చేస్తానన్నారు అంతకు ముందు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి విజయ నాయక్



అధ్యాపకులు శ్రీధర్ కృష్ణ మహేష్ ఉపేందర్ శ్రీనివాస్ , డి శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే తొలి రక్షణ

### ఐసిడిఎస్ సూపర్వైజర్ సరిత

**నడిగూడెం, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్) :**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లులు, గర్భిణీలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సరిత మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి అరగంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు.ఆ సమయంలో వచ్చే తొలి పాలు (కొలస్ట్రం) శిశువుకు అధిక రోగనిరోధక శక్తిని అందించి, అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు.శిశువుకు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలు అందిస్తూనే, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే అదనపు పోషకాహారాన్ని కూడా ఇవ్వాలని సూచించారు. దీంతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని చెప్పారు.ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకొని, వాటిని తప్పనిసరిగా శిశువుకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సోమయ్య, ఉపసర్పంచ్ సంపతి వీరబాబు, పంచాయతీ కార్యదర్శి గోపి, ఏఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్ తాటికొండ చిట్టెమ్మ, లక్ష్మి ,ఆయాలు పద్మ, జమాలి ,గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీలతో కీలక సమావేశం

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 :(నవజ్యోతి ప్రతినిధి)**

గాజులరామారం సర్కిల్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, అవసరమైన చోట్ల పోలింగ్ కేంద్రాల స్థల మార్పు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజలకు అనుకూలంగా ఉండేలా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని అధికారులు కోరారు. ఏదైనా పోలింగ్ కేంద్రాన్ని మార్చాల్సిన అవసరం ఉన్నా, కొత్త కేంద్రం ఏర్పాటు చేయాల్సి వచ్చినా లేదా ప్రస్తుతం ఉన్న కేంద్రంలో సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నా, వాటిని సరైన కారణాలతో లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్ఓ & డిప్యూటీ కమిషనర్ యు. వెంకటరాములు, ఏఈఆర్ఓ & ఏఎంసీ ప్రమీల, సుమిత్ర, ఎలక్షన్



సూపరింటెండెంట్ బి. బాలకృష్ణతో పాటు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# జయశంకర్ సార్ చూపిన మార్గమే తెలంగాణ అభివృద్ధికి దిక్సూచి

- **ఏనుగు సుదర్శన్ రెడ్డి**
- **తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ సార్**
- **విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన బీజేపీ నాయకులు**

**ఘట్కేసర్, ఆగస్టు 06,(నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పోచారం డివిజన్ పరిధిలోని కచావని సింగారం గ్రామంలో తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘట్కేసర్ మండల అధ్యక్షులు బసవరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం



తన జీవితమంతా అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించి, ఎన్నో దశాబ్దాల పాటు ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మేధావి జయశంకర్ సార్ అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆయన కలలు కన్న సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలన, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి, రైతు సంక్షేమం, నాణ్యమైన విద్య, ప్రజలకు సమాన అవకాశాలు వంటి లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు భారతీయ జనతా పార్టీ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తుందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. జయశంకర్ సార్ చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మన్యం, మేడిపల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, మాజీ అధ్యక్షులు గిరి గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి సంతోష్, సీనియర్ నాయకులు బాలరాజ్ గౌడ్, ప్రభంజన్ గౌడ్, కరుణాకర్ రెడ్డి జిహెచ్ఎంసి బీసీ సంఘం ఉపాధ్యక్షులు అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు సతీష్ కుమార్,సాయి బీజేపీ మండల, డివిజన్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ ధ్యేయం

- పటాన్‌చెరు నియోజకవర్గ 3వ మహాసభలు
- నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**పటాన్‌చెరు, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ అన్నారు. కష్టకాలంలో ప్రతి జర్నలిస్టుకు అండగా నిలుస్తూ, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చే వరకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐబీ అతిథి గృహంలో టీడబ్ల్యూజేఎఫ్ పటాన్‌చెరు నియోజకవర్గ 3వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలకు జిల్లా అధ్యక్షులు ఎల్లోయి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్, రాష్ట్ర నాయకులు మేకల కృష్ణయ్య, ప్రభు, జాతీయ కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలులో టీడబ్ల్యూజేఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. వృత్తి గౌరవాన్ని కాపాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ

**గౌరవ సలహాదారులు: వాసుదేవ్, శ్రీనివాస్**
**అధ్యక్షుడు: బాదిని శ్రీనివాస్**
**ప్రధాన కార్యదర్శి: కొత్తకొండ సత్యం**
**ఉపాధ్యక్షులు: రవీందర్ చారి, నరసింహారెడ్డి, సంగమేశ్వర్**
**సహాయ కార్యదర్శులు: గిరి, ప్రసాద్, కృష్ణ గౌడ్, రాము**
**కోశాధికారి: భానుచందర్**
**ప్రచార కార్యదర్శి: ముద్దంగుల ఎల్లయ్య**
**ఈసీ కమిటీ సభ్యులు: గణేష్, రాజు, రాజశేఖర్, విజయ్, రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.**

# రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం..

- శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు భారీ విరాళం
- రూ.1.50 లక్షల క్రీడా సామగ్రి, 50 బెంచీల విరాళం
- విద్యార్థుల భవిష్యత్తుకు దాతల సహకారం ఎంతో గొప్పది - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి)**



పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థుల అభ్యున్నతి కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు రూ.1.50 లక్షల విలువైన క్రీడా సామగ్రితో పాటు 50 బెంచీలను అందించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. బుధవారం శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాఠశాల ప్రబంధకారిణి సమితి అధ్యక్షుడు గౌరు దయాకర్‌కు క్రీడా సామగ్రి, బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ వంటి విద్యాసంస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా విద్యాసంస్థల అభివృద్ధికి సమాజంలోని అన్ని వర్గాలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చిలుకూరు బాలు, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, ఇమ్రాన్, కౌన్సిలర్ ఇంద్రకుమార్, రోటరీ క్లబ్ సభ్యులు విశ్వనాథ్, సిమ్రాన్ మైనీ, అశోక్ కుమార్, మాశెట్టి వీరయ్య, రేపాల అంతయ్య, సుదర్శన్, ఇన్నర్ వీల్ సభ్యులు మాశెట్టి భాగ్యలక్ష్మి , రేపాల వాసవి, గౌరు సీత, శ్రీ సరస్వతి శిశు మందిర్ సభ్యులు మురహరి, అనంతరెడ్డి, యామిని, వెంకటేశ్వర్లు, గూడూరు శ్రీనివాసరావు, బండారు ప్రసాద్, తిప్పన వెంకటేశ్వర్ రెడ్డి, రంగారావు, జగన్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సుష్మా స్వరాజ్ సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయం

**తెలంగాణ సాధనలో సుష్మా స్వరాజ్ పాత్ర మరువలేనిది - సాధినేని శ్రీనివాసరావు**

**మిర్యాలగూడ, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి)**



పట్టణం లోని ఒకటో పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చిన్నమ్మగా పేరుగాంచిన మాజీ కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ 7వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు సాధినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో తన వాగ్దాటితో, పోరాట పటిమతో జాతీయ ప్రజాస్వామ్య కూటమి భాగస్వామ్య పక్షాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, తెలంగాణ రాష్ట్ర సాధనకు విశేష కృషి చేసిన మహనీయ నాయకురాలు సుష్మా స్వరాజ్ అని కొనియాడారు. తెలంగాణ కోసం విద్యార్థులు మరిన్ని బలిదానాలు చేయాల్సిన అవసరం లేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఫలితాలను ప్రజలే అనుభవించాలని ఆమె పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఆమె చేసిన సేవలను ఈ నేల ఎన్నటికీ మరువదని, తెలంగాణ ప్రజల తరఫున ఆమెకు ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ అధ్యక్షుడు బంటుగిరి, ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు చిలుకూరి వెంకటేశ్వర్లు, మోదాల అశోక్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోనే కలితా రెడ్డి, నక్క రవి, మునగాల శివ, సీనియర్ నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, తల్లం అశోక్, చిలుకూరి శామ్, నాగుబండి విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వెలుగు నాగరాజు, మంచ శివ, పోల వెంకటేశ్వర్లు, మేడల రవి, మేకల నందు, పులి శ్రీను, వసంత్, లింగం సైదులు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ రుద్ర కాలనీలో అంధకారం....

- వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- వెంటనే చర్యలు తీసుకోవాలి: కేవై ప్రణయ్

**రాజేంద్రనగర్ ఆగస్టు 06 (నవ జ్యోతి ప్రతినిధి ) :**

శంషాబాద్ మండల పరిధిలోని రుద్ర కాలనీలో చాలా రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీ మొత్తం చీకటిమయంగా మారిందని రుద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవై ప్రణయ్ ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారని, పాములు, వీధి కుక్కల సంచారం పెరగడంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రుద్ర కాలనీలో వీధి దీపాలను పునరుద్ధరించి, ప్రజలకు భద్రత కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కేవై ప్రణయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన యజమానులపై క్రిమినల్ కేసులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని ఏసీపీ ప్రసాద్ హెచ్చరిక

**అమీన్‌పూర్, ఆగస్టు 6(నవజ్యోతి ప్రతినిది):**





పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన పలువురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది.నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు అనుమతులు,సెట్ బ్యాక్, పార్కింగ్,భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నప్పటికీ కొందరు బిల్డర్లు వాటిని బేఖాతరు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇక ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో కూడా భారీ భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నప్పటికీ అక్కడ అక్రమ నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, అనుమతులు లేని భవనాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై అమీన్‌పూర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్‌ను వివరణ కోరగా, "అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేశాం. ఇకపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. చట్టాన్ని ఉల్లంఘించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం" అని స్పష్టం చేశారు.

# కార్మికుల ఆందోళనపై యాజమాన్యానికి సీఐటీయూ హెచ్చరిక

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**



గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఎంటీఏఆర్ టెక్నాలజీస్ ఈఓయూ పరిశ్రమలో ఫిక్స్డ్ టర్మ్ కార్మికుల ఆందోళన గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకుంది. కార్మికులకు సంఘీభావంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వంటా-వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి యాజమాన్యానికి నిరసన తెలిపారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకుండా ఫిక్స్డ్ టర్మ్ పేరుతో కొనసాగించడం, అధిక పని గంటలు చేయించడంతో పాటు చట్టబద్ధమైన బోనస్, సమాన పనికి సమాన వేతనం, అదనపు పనికి డబుల్ వేతనం వంటి హక్కులను కల్పించకపోవడం కార్మికులపై జరుగుతున్న అన్యాయమని విమర్శించారు. ఇటీవల విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, అర్హులైన ఫిక్స్డ్ టర్మ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం వెంటనే స్పందించాలని, లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ పర్మినెంట్ అండ్ ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు కీలుకాని లక్ష్మణ్, లింగస్వామి, సంతోష్, రాము, ధర్మారావు, లక్ష్మయ్యతో పాటు కార్మికులు సింహాచలం, మదన్, మోసిన్, రాజ్‌కుమార్, లింగంరాజు, ఫైజల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



**కూకట్‌పల్లి, ఆగస్టు 6, ( నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆకాంక్షించారు. కూకట్‌పల్లి పరిధిలో ఆషాఢ ముగింపు బోనాల సందర్భంగా మూసాపేట్‌లోని నల్లపోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, తూము సంతోష్, మల్లేష్ యాదవ్, సప్పిడి భాస్కర్, తోట రాజు, బాలరాజు, జోజమ్మ, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి



**కూకట్ పల్లి, ఆగస్టు 6, ( నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాల వెనుక ఎంతో చరిత్రతో పాటు ఆరోగ్య పరిరక్షణ అంశాలు దాగి ఉన్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. గురువారం ఆషాఢ బోనాల సందర్భంగా నియోజకవర్గంలోని బాలాజీనగర్, కూకట్‌పల్లి డివిజన్లలోని పలు అమ్మవారి దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే బ్యాక్టీరియా, వైరస్‌లు ఆలయాల్లో సమర్పించే పసుపు, కుంకుమ, ధూప దీప నైవేద్యాల వల్ల నశించిపోతాయని వివరించారు. పూజలతో పాటు ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడం ప్రతి ఒక్కరికీ ముఖ్యాతి ముఖ్యమని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సరైన ఆహార నియమాలు పాటిస్తే నిత్యం ఆరోగ్యంగా ఉంటూ లక్ష్యాలను సాధించవచ్చని పిలుపునిచ్చారు. అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

# పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయల మోసం చేసిన.. నిందితురాలు రూపా రెడ్డి అరెస్ట్

- అధిక లాభాల ఆశ చూపించి పలువురి నుంచి డబ్బులు వసూలు –
- బాధితుల కోసం దర్యాప్తు ముమ్మరం

**రాజేంద్రనగర్ ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి ) :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెట్టుబడి మోసం కేసులో నిందితురాలు పట్లోళ్ల రూపా రెడ్డిను నార్సింగి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం: నిందితురాలు పటోళ్ల రూపా రెడ్డి పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి పలువురు వ్యక్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించి మోసానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇదే తరహాలో మరికొంత మంది బాధితులు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. బాధితుల వివరాలను గుర్తించడం, వారు కోల్పోయిన మొత్తాలను నిర్ధారించడం, ఆర్థిక లావాదేవీలను విశ్లేషించడం, నిధుల జాడను గుర్తించడం, సంబంధిత డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను సేకరించడం కోసం దర్యాప్తును విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితురాలు పట్లోళ్ల రూపా రెడ్డిని పోలీసు కస్టడీలోకి తీసుకుని, అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

## నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి

**కూకట్ పల్లి, ఆగస్టు 6, ( నవజ్యోతి ప్రతినిధి):**



నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ కోరారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేశారు.మూసాపేట్ వై జంక్షన్ ఫ్లైఓవర్ సమస్యలు, రోడ్డు విస్తరణ, లేక్ వ్యూ, బాలానగర్ నాలాలు, సిల్ట్ తొలగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనేక కాలనీల్లో పాడవుతున్న రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రమేష్ విన్నపంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సృజన, త్వరలోనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మేడ్చల్ అర్బన్ బీజేపీకి కొత్త నాయకత్వం

### జిల్లా అధ్యక్షుడిగా డి. గిరి వర్ధన్ రెడ్డికి బిజెపి నాయకుల అభినందనలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి) :**

భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డి. గిరి వర్ధన్ రెడ్డిని పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో మేడ్చల్ అర్బన్ జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని డి. గిరి వర్ధన్ రెడ్డి అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆయన సారథ్యంలో జిల్లాలో బీజేపీ సంస్థాగతంగా మరింత విస్తరించి, రానున్న ఎన్నికల్లో విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకురాలు ఝాన్సీ, మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమణి, రమేష్ వేముల, పులి బలరాం, నల్ల జై శంకర్ గౌడ్, కీర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొని డి. గిరి వర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కీసర సర్కిల్ కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

### తెలంగాణ సాధనలో జయశంకర్ సేవలు చిరస్మరణీయం: డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం



**కీసర, ఆగస్టు 06,(నవజ్యోతి ప్రతినిధి) :**

కీసర సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గౌరవ డిప్యూటీ కమిషనర్ జి.రామలింగం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన విశిష్ట సేవలు, ఉద్యమానికి అందించిన సైద్ధాంతిక బలం, సమాజానికి చేసిన కృషిని అధికారులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన చూపిన మార్గం భావితరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీలు చంద్రశేఖర్, గంగన్న, మధుసూదన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని జయశంకర్‌కు నివాళులర్పించారు.

## రోడ్డు దాటుతుండగా మృత్యువు ఢీకొట్టింది

- వేగం ప్రాణం తీసింది..జగద్గిరిగుట్టలో ఘోర రోడ్డు ప్రమాదం
- సీసీ కెమెరాలే కీలకం..ప్రమాదానికి కారణమైన రైడర్ పోలీసుల అదుపులో

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి):**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్పెంటర్ మృతి చెందాడు. అంజయ్యనగర్‌కు చెందిన మడిపోజు విజయ్ కుమార్ (40) ఈ నెల 5న భువనగిరి ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఓం సాయి స్టేషనరీ సమీపంలో రోడ్డు దాటుతుండగా TS08GG2136 నంబర్ గల హోండా డియో స్కూటీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే పద్మజ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఉషశ్రీ ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలంలోని సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా స్కూటీ రైడర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు జగద్గిరిగుట్ట సిఐ ఎన్. సురేష్ తెలిపారు.

# జయశంకర్ చూపిన బాటలోనే తెలంగాణ ప్రగతి

- జయశంకర్ విగ్రహావిష్కరణతో ఉద్యమ స్ఫూర్తికి నూతన ఊపు
- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్:ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 6: (నవజ్యోతి ప్రతినిధి) :**



తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటిచెప్పే దిశగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట వార్డులో ఆయన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సిద్ధాంత బలం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలే ఉద్యమానికి అసలైన శక్తి అని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జీవితాంతం నిస్వార్థంగా పోరాడిన జయశంకర్ ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని పేర్కొంటూ, ఆ లక్ష్య సాధనలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాంబశివరెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, వేముల శ్రీనివాస్, ధర్మారెడ్డి, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీఎస్.రెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళీ యాదవ్, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాతతో పాటు పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాట్రియాల్ జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు యాంటీడ్రగ్ పై అవగాహన సదస్సు.

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనీ విద్యార్థులకు పోలీసుల పిలుపు

**రామాయంపేట, ఆగస్టు 6 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో రామాయంపేట పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల (డ్రగ్స్) వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు రమేష్ ,నరసింహగౌడ్ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక,ఆర్థిక, సామాజికంగా తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు. మత్తు వ్యసనాలకు బానిసైతే విద్య, కుటుంబం, భవిష్యత్తు దెబ్బతింటాయని,చట్టపరంగా కూడా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.విద్యార్థులు చెడు స్నేహాలకు,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులతో "డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాలయ్య ,ఉపాధ్యాయులు గణేష్, శ్రీనివాస్,శంకర్,మహేందర్,గోపాల్, శ్యాంసుందర్,ఉమా మహేశ్వర్ గౌడ్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ ప్రణతి,పోలీసు సిబ్బంది,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

- తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళి..
- జయశంకర్ జయంతి వేడుకల్లో ఘనంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- ప్రధాన చౌరస్తాల అభివృద్ధికి శంకుస్థాపన.
- మున్సిపల్ ప్రత్యేక నిధులతో రామాయంపేటకు కొత్త అందాలు

**రామాయంపేట,ఆగస్టు 6 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేట రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జయశంకర్‌కు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని,ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.అనంతరం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని సిద్దిపేట, మెదక్ చౌరస్తాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ప్రత్యేక నిధులతో మెదక్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సిద్దిపేట చౌరస్తాలో స్వామి వివేకానంద విగ్రహాలను ఏర్పాటు చేసి, వాటి పరిసరాల్లో వాటర్ ఫౌంటెన్లు, గార్డెనింగ్, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రామాయంపేట అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు.జయశంకర్ విగ్రహావిష్కరణ అనంతరం ఎమ్మెల్యే సమీపంలోని క్రీ పాయింట్‌ను సందర్శించి మహిళలు తయారు చేసిన మక్క రొట్టె, నాటుకోడి కూరను రుచి చూసి అభినందించారు. మహిళల స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, కౌన్సిలర్లు దేవుని రంజిత్, గుగులోత్ రవి, కో-ఆప్షన్ సభ్యులు చింతల రాధాభవాని యాదగిరి, దేమె యాదగిరి, ఆసియా సుల్తాన్, గౌస్, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరఫ్ యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఎమ్మెల్యే కుమారుడి సంచలన ప్రెస్‌మీట్

- ప్రేమించిన యువతిని వివాహం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ తనపై, కాబోయే భార్య కుటుంబంపై దాడి చేయిస్తున్నారని ఆరోపణలు..

**రాజేంద్రనగర్, ఆగస్టు 06 (నవజ్యోతి ప్రతినిధి)**

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తనయుడు గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. తన ప్రేమ వివాహాన్ని వ్యతిరేకిస్తూ తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వల్ల తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆరోపించారు. తాను ప్రేమించిన యువతిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తనపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని, కాబోయే భార్య కుటుంబ సభ్యులను కూడా బెదిరిస్తూ దాడులు చేయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనకు, తన కాబోయే భార్యకు ఎలాంటి హాని జరిగినా అందుకు తన తండ్రి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలని ఆయన ఆరోపించారు. తమ ప్రాణాలకు ముప్పు ఉన్నందున వెంటనే పోలీసు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.

# కుషాయిగూడ బస్ స్టాప్ పరిరక్షణలో మరో ముందడుగు

### చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో ఏసీపీకి వినతి

- బారికేడ్ల తొలగింపుపై చర్యలు – ప్రజా సమస్యల పరిష్కారానికి కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ నిరంతర పోరాటం

**కుషాయిగూడ,ఆగస్టు 06,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ బస్ స్టాప్ పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం మరియు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల తొలగింపు కోసం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి మరో కీలక ముందడుగు పడింది. గతంలో నిర్వహించిన మహా ధర్నా, అనంతరం కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌లకు సమర్పించిన వినతిపత్రాల నేపథ్యంలో బుధవారం మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ స్వయంగా కుషాయిగూడ బస్ స్టాప్,పోచమ్మ గుడి జంక్షన్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలోని అసోసియేషన్ ప్రతినిధులు ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏసీపీ దృష్టికి తీసుకెళ్లి మరోసారి వినతిపత్రం అందజేశారు.సమస్య తీవ్రతను వివరించడంతో ఏసీపీ సానుకూలంగా స్పందించి, స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న కొన్ని బారికేడ్లను వెంటనే తొలగించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, కుషాయిగూడ ప్రజల హక్కులు, బస్ స్టాప్ పరిరక్షణ, మెరుగైన రవాణా సౌకర్యాల కోసం అసోసియేషన్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజల సహకారంతో సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.బస్ స్టాప్ వద్ద బస్సులు యథావిధిగా ఆగి ప్రయాణికులు సురక్షితంగా ఎక్కి దిగే విధంగా మిగిలిన బారికేడ్లను కూడా పునఃసమీక్షించి అవసరమైన మార్పులు చేయాలని అసోసియేషన్ కోరింది.



ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు,కుషాయిగూడ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN